రహదారి విస్తరణ పనులు పునర్ ప్రారంభం

- నాదర్‌గుల్-గాంధీనగర్ రోడ్డులో తీరనున్న వాహనదారుల ఇక్కట్లు
- పనులు పర్యవేక్షించిన కమిషనర్ సరస్వతి

సరూర్‌నగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్-గాంధీనగర్ ప్రధాన రహదారి విస్తరణ పనులు పునర్ ప్రారంభమయ్యాయి. దాదాపు రెండేళ్లుగా ఈ రహదారి పనులు నిలిచిపోగా.. తాజాగా అధికారులు పనులకు శ్రీకారం చుట్టారు. వాస్తవానికి గత మే నెలలో నాదర్‌గుల్‌లో జరిగిన లింగమయ్య జాతరలోగానే రోడ్డును అభివృద్ధి చేయాలని భావించి బస్టాండ్ నుంచి గ్రీన్ హోమ్స్ కాలనీ కల్వర్టు వరకు రోడ్డును తవ్వారు. అయితే ముందుగా విద్యుత్ స్తంభాలు, చెట్లు తొలగించకపోవడంతో రోడ్డు పనులకు బ్రేక్ పడింది. అప్పట్లో అధికారులు, పాలకులు తీసుకున్న అనాలోచిత నిర్ణయం కారణంగా దాదాపు ఏడు నెలలుగా రోడ్డు పనులకు గ్రహణం పట్టింది. రెండేళ్ల క్రితమే విస్తరణ నిమిత్తం రోడ్డుకు ఇరుపక్కలా కొంతమేర తవ్వి కంకర పరిచినప్పటికీ.. అనంతరం కాంట్రాక్టర్ చేతులెత్తేయడం, అధికారులు పట్టించుకోకపోవడంతో అప్పటి నుంచీ వాహనదారులు నరకం అనుభవిస్తున్నారు. లింగమయ్య జాతరనాటికి రోడ్డు నిర్మిస్తామని చెప్పి బీటీ రోడ్డును తవ్వించారు. తీరా జాతరనాటికి ఉన్న రోడ్డు కూడా ఉపయోగంలో లేకుండా పోయింది. దీంతో గ్రామానికి వచ్చిన వేలాది మంది భక్తులు, అతిథులు గ్రీన్‌హోమ్స్ కాలనీ, వంశీధర్ స్కూల్ మీదుగా వెళ్లాల్సి వచ్చింది.



సోమవారం మొదలైన సీసీ రోడ్డు పనులు



మే నెలలో తవ్వి వదిలేసిన నాదర్‌గుల్ రహదారి(ఫైల్)

బీజేపీ నేతల ఆందోళనతో..

నాదర్‌గుల్ రోడ్డు నరకప్రాయంగా మారడంతో స్థానిక బీజేపీ నాయకులు రెండు నెలల క్రితం ఆందోళన నిర్వహించి రోడ్డు మీదే వంటావార్పు చేశారు. అప్పట్లో వారం రోజుల్లోగా రోడ్డు పనులు మొదలుపెట్టిస్తామని హామీ ఇచ్చిన అధికారులు ఆ తర్వాత పట్టించుకోలేదు. తాజాగా చేవెళ్ల రోడ్డు ప్రమాదం జరిగిన రెండు రోజులకు బీజేపీ నేతలు మరోమారు రోడ్డుపై ఉన్న గుంతల వద్ద బైఠాయించి ఆందోళన నిర్వహించారు. దాంతో ఎట్టకేలకు మునిసిపల్ అధికారులు స్పందించి రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు.

రోడ్డు విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయిస్తాం

- బడంగ్‌పేట్ మునిసిపల్ కమిషనర్ సరస్వతి

నాదర్‌గుల్- గాంధీనగర్ రహదారి విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని బడంగ్‌పేట్ మునిసిపల్ కమిషనర్ పి.సరస్వతి తెలిపారు. సోమవారం ఆమె ఇంజనీరింగ్ అధికారులతో కలిసి రోడ్డు పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాల కారణంగా పనులు చేపట్టడంలో జాప్యం జరిగిందని, ప్రస్తుతం వానలు తగ్గిపోయినందున పనులు మొదలుపెట్టించామని తెలిపారు. నాదర్‌గుల్ బస్టాండ్ నుంచి గ్రీన్‌హోమ్స్ కాలనీ వరకు సీసీ రోడ్డు పనులు జరుగుతున్నందున ఆ రోడ్డు మూసేశామని, వాహనదారులు ఎంవీఎస్ఆర్ కాలేజీ సమీపంలోని మర్రిచెట్టు వద్ద ఎడమ వైపు తిరిగి సాయిబాబా టెంపుల్ నుంచిగానీ, గ్రీన్‌హోమ్స్ కాలనీ వద్ద కుడివైపు తిరిగి వంశీధర్ స్కూల్ నుంచి గానీ రాకపోకలు సాగించవచ్చునని సూచించారు. పనులు పూర్తయ్యేదాకా వాహనదారులు సహకరించాలని ఆమె కోరారు.



బీటీ రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ సరస్వతి



కుర్మల్‌గూడ మెగాడ్రీమ్‌సిటీ కాలనీలో పర్యటిస్తున్న నర్సింహారెడ్డి

తీర్మానం చేసిన పనులు మొదలుపెట్టాలి

సరూర్‌నగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో గత పాలకవర్గం హయాంలో చేసిన తీర్మానాలకు సంబంధించిన అభివృద్ధి పనులను వెంటనే మొదలుపెట్టాలని మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి అధికారులను కోరారు. సోమవారం ఆయన కుర్మల్‌గూడ 10వ డివిజన్‌లోని మెగాడ్రీమ్‌సిటీ కాలనీలో పర్యటించి స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో పెండింగ్‌లో ఉన్న వాటర్ పైపులైన్ పనులు, రోడ్ల పనులు త్వరగా చేపట్టాలని ఆయన కోరారు. ఆయా పనులకు గత పాలకవర్గంలో తీర్మానాలు సైతం చేసినందున పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డీఈఈ వెంకన్న, కాలనీ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో సినీ నటుడు ప్రదీప్‌కుమార్ తదితరులు



నృత్యం చేస్తున్న విద్యార్థిని

చదువు ఉన్నత స్థానంలో నిలబెడుతుంది

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చదువు మనిషిని ఉన్నత స్థానంలో నిలబెడుతుందని సినీ నటుడు కేవీ ప్రదీప్‌కుమార్ అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్ గ్రామ పరిధిలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఇంజనీరింగ్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రదీప్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై కళాశాల ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అబిషేక్‌రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకుంటారని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎల్‌వీ వేణుగోపాలరావు, హెచ్‌వోడీ, ఆధ్యాపకులు పాల్గొన్నారు.

'ఇళ్ల మధ్య ఎస్టీపీని ఏర్పాటు చేయొద్దు'

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇళ్ల మధ్యలో ఎస్టీపీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయొద్దని పెద్దఅంబర్‌పేట్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దండెం రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పెద్దఅంబర్‌పేట్ సర్వే నంబర్ 292లో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఎస్టీపీ ప్లాంట్ స్థలాన్ని సోమవారం ఆయన కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుట్టూ జనావాసాలు ఉన్న ప్రాంతంలో ఎస్టీపీని ఏర్పాటు చేయడం సమంజసం కాదని అన్నారు. ప్లాంట్ ఏర్పాటును కాలనీ వాసులందరు వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ కాకుండా జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలని కోరారు. ప్లాంట్‌కు వ్యతిరేకంగా మంగళవారం పలు కాలనీల వాసులతో కలిసి ఆందోళనకు దిగనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

వరకట్నం కోసం వేధింపులు.. వివాహిత ఆత్మహత్య



గంగోత్రి (ఫైల్)

కొత్తపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వరకట్నం తీసుకురావాలని భర్త, అత్తింటి వారు వేధించడంతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ కథనం ప్రకారం... మన్సూరాబాద్ వాంబే కాలనీలో నివసించే కుంచం గంగోత్రి(21) బీటెక్ విద్యార్థిని. ఇటీవలే ఆమె చిన్న రవిరాలకు చెందిన భాను అనే వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. భర్తతో కలిసి కాపురం చేస్తున్న గంగోత్రి, తన భర్త, ఆయన కుటుంబ సభ్యులు తనను కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నారని తరచూ తల్లి దండ్రులకు చెప్పేది. భర్త వేధింపులు తాళలేక గంగోత్రి సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. 'నా మృతికి భాను కారణం' అని గంగోత్రి రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఉస్మానియా ఆస్పత్రిలో పోస్ట్ మార్టం చేసిన అంతనం మృతదేహాన్ని ఆమె కుటుంబసభ్యులకు అప్పగించారు. గంగోత్రి తండ్రి సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లాంగ్డి, మల్కం జాతీయ పోటీలకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక



లాంగ్డి, మల్కం క్రీడల్లో జాతీయ పోటీలకు ఎంపికైనా విద్యార్థులు

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్‌లోని వ్యాస్ మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు లాంగ్డి, మల్కం క్రీడల్లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ చైర్మన్ సర్వేశ్వర్‌రెడ్డి, కోచ్ నీలేష్ తెలిపారు. వేముల యశశ్విని మల్కం క్రీడ, వేముల యజ్ఞ, జాను లాంగ్డి క్రీడలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభకనబర్చి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు వారు చెప్పారు. ఈ నెల 21న గుజరాత్‌లోని వడోదరలో జరుగనున్న లాంగ్డి పోటీల్లో యజ్ఞ, జాను, 24న మధ్యప్రదేశ్‌లోని ఉజ్జాయినిలో జరుగనున్న మల్కం క్రీడ జాతీయ పోటీల్లో యశశ్విని పాల్గొననున్నట్లు కోచ్ తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులను స్కూల్ యాజమాన్యంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు..



రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం ప్రతాప్ తదితరులు

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ధనుంజయులు ఎంపికైనట్లు హెచ్‌ఎం ప్రతాప్ తెలిపారు. ఈ నెల 16, 17, 18 తేదీలో సింకింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీల్లో అండర్-14 బాలుర విభాగంలో ధనుంజయనేయులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ట్రంక్ లైన్ పనులను వెంటనే పూర్తి చేయండి

- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి
- కుంగిన ట్రంక్‌లైన్‌ను అధికారులతో కలిసి పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): యుద్ధ ప్రతిపాదికన ట్రంక్ లైన్ పనులను పూర్తి చేసి కాలనీ వాసులకు విముక్తి కల్పించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సూధీర్‌రెడ్డి జలమండలి అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో అధికారులు ఏలాంటి నిర్లక్ష్యం వహించొద్దని హెచ్చరించారు. హయత్‌నగర్ డివిజన్ పద్మావతి కాలనీలో కుంగిన ట్రంక్ లైన్ కారణంగా డ్రైనేజీ మురుగు నీరు పక్కనే ఉన్న జంట చెరువుల్లో కలుస్తున్న సమస్యపై "కుమ్మరికుంట, బాతుల చెరువు.. దుర్వాసనకు నిలయం" అనే శీర్షికతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పందించారు. సోమవారం జలమండలి అధికారులు, స్థానిక కాలనీ వాసులతో కలిసి ఎమ్మెల్యే పద్మావతి కాలనీలో కుంగిన ట్రంక్‌లైన్‌ను పరిశీలించారు. ఎన్నిసార్లు చెప్పినా తమ గోడును జలమండలి అధికారులు పట్టించుకోవడంలేదని ఎమ్మెల్యే ఎదుట కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గత 20 ఏళ్ల క్రితం అప్పటి జనాభాకు అనుగునంగా ఏర్పాటు చేసిన ట్రంక్ లైన్ కావడంతో సమస్య వస్తుందని అన్నారు. ట్రంక్ లైన్ మరమ్మతు పనులు జరుగుతుండడంతో ఆ మురుగు నీరు పక్కన చెరువులో కలుస్తుండడంతో సమీప కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే అని అన్నారు. వెంటనే మరమ్మతు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ట్రంక్‌లైన్ శాశ్వత పరిష్కారానికి సుమారు రూ. 68 కోట్ల నిధులు అవసరం ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులను రాబట్టేందుకు కృషి చేస్తానని అన్నారు. ట్రంక్‌లైన్ పనులు పూర్తి అయిన వెంటనే చెరువులను శుద్ధిచేసి సుందరీకరణ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు మహేందర్‌నాయక్, వాహిణి, మాజీ కార్పొరేటర్ సామ తిరుమలరెడ్డి, శ్రీధర్‌గౌడ్, భాస్కర్‌సాగర్, మల్లేష్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



కుంగిన ట్రంక్ లైన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, అధికారులు

ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

వనస్థలిపురం, నవంబరు 17(ఆంధ్ర జ్యోతి): ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బాలాజీనగర్‌లోని షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవ వేడకలు ఆలయ కమిటీ చైర్ పర్సన్ ముడుపు జయయాదగిరి రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. ఈ వేడుకలకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న, బాలాజీనగర్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ముడుపు సందీప్ రెడ్డి, మాజీ వార్డు కమిటీ సభ్యులు ఎం.నాగమణి రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను సవరణ పేరిట అక్రమాలు

- అడ్డుకట్ట వేయాలని జడ్సీకి బీజేపీ కార్పొరేటర్లు వినతి

ఎల్బీనగర్, నవంబర్ 17(ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను సవరణ పేరిట జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని బీజేపీ కార్పొరేటర్లు జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌ను కోరారు. సోమవారం జోనల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి నేతృత్వంలో కార్పొరేటర్లు జోనల్ కమిషనర్‌ను కలిశారు. జడ్సీ వారితో ప్రత్యేకంగా సమావేశమై వారు లేవనెత్తిన అంశాలను వివరంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఆస్తి పన్ను సవరణ పేరుతో బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా నిర్దిష్టకారణం లేకుండా సవరణ పేరుతో అడ్డగోలుగా ఆస్తిపన్ను పెంచడంతో ప్రజలపై ఆర్థిక భారం పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నచిన్న వ్యాపారాలు చేస్తున్న వారి ఇళ్లకు కమర్షియల్ ట్యాక్స్ వేయడం అన్యాయమని అన్నారు. ఎర్లీబర్డ్ ఆఫర్ ద్వారా 5 శాతం ఇచ్చి ఆ వెంటనే 3 సంవత్సరాల అదనపు ఆస్తిపన్ను వసూలు చేయడం దారుణమని అన్నారు. ఆస్తిపన్ను విషయంలో అక్రమాలకు పాల్పడుతున్న సిబ్బందిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి, చింతల అరుణసురేందర్‌యాదవ్, నాయికోటి పవన్‌కుమార్, మొద్దు లచ్చిరెడ్డి, బీజేవైఎం నాయకుడు సిల్వేరి అనీల్‌కుమార్ పాల్గొన్నారు.



జడ్సీకి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ కార్పొరేటర్లు

నిధులు మంజూరు చేయండి: కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట: కొత్తపేట డివిజన్ సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేసి, సహకరించాలని జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జడ్సీ హేమంత కేశవ్ పాటిల్‌కు కార్పొరేటర్ పవన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. సోమవారం జడ్సీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన కొత్తపేటలోని సమస్యలు వినిపించారు. డివిజన్‌లో పలు చోట్ల రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. కమర్షియల్ ట్యాక్స్ కాలనీ రోడ్ నెం.1లో తరచూ తాగునీరు కలుషితమవుతోందని, మారుతీనగర్, జైన్‌మందిర్ వెనుక లేన్‌లో తరచూ తలెత్తే మురుగు నీటి లీకేజీ, పలు ప్రాంతాల్లో లో ప్రెజర్ నీటి సరఫరా తదితర సమస్యలను జలమండలి జీఎం బలరాంకు కార్పొరేటర్ విన్నవించారు.

సీనియర్ సిటిజన్స్ భవన నిర్మాణానికి నిధులు ఇవ్వండి : నవజీవన్ రెడ్డి

వనస్థలిపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ భవన నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. హయత్‌నగర్ డివిజన్ ద్వారకామాయినగర్ కాలనీ సీనియర్ సిటిజన్ భవనం మొదటి అంతస్తు నిర్మాణ పనులకు నిధులు మంజూరు చెయాలని కోరుతూ సోమవారం జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ అభివృద్ధికి తన వంతుగా కృషి చెస్తానని అన్నారు. సీనియర్ సిటిజన్స్ కాలనీల అభివృద్ధికి తమ వంతుగా తగు సలహాలు, సూచనలు ఇవ్వాలనీ ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.



జడ్సీకి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి

- కార్పొరేటర్ సుజాతానాయక్



జడ్సీకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

చంపాపేట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని కాలనీలలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌కు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సుజాతానాయక్ సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని అగ్రికల్చర్‌కాలనీలో 50ఫీట్ల రహదారి నిర్మాణం, విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం, నందనవనంలోని శ్మశానవాటికలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని జడ్‌సీని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

రామోజీ ఫిల్మ్‌సిటీ పేరును 'రామోజీ చిత్రనగరి'గా మార్చాలి

- బీజేపీ రాష్ట్ర నేత శ్రీరాములు యాదవ్



శ్రీరాములు యాదవ్

సరూర్‌నగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్వతహాగా తెలుగు భాషాభిమాని అయిన దివంగత రామోజీరావు కలల సౌధం అయిన రామోజీ ఫిల్మ్‌సిటీ పేరును 'రామోజీ చిత్రనగరి'గా మార్చాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ రామోజీ కుటుంబ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగు జాతి, తెలుగు భాష గౌరవాన్ని ప్రపంచ యవనికపై అగ్రగామిగా నిలిపిన మహా మనిషి రామోజీరావు అని, ఆయన పేరుపై ఉన్న స్టూడియోకు అంగ్లంలో పేరు ఉండడం సహేతుకంగా లేదని అన్నారు. తెలుగు భాషపై ఆయనకున్న మక్కువను పరిగణనలోకి తీసుకుని ఫిల్మ్‌సిటీ పేరును అచ్చమైన తెలుగులో 'రామోజీ చిత్రనగరి'గా మార్చి తెలుగు వారి హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోవాలని అందెల సూచించారు.

సామనగర్ కాలనీ సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక



నూతన అధ్యక్షుడు జానయ్య గౌడ్

వనస్థలిపురం, నవంబరు 17(ఆంధ్ర జ్యోతి): సామనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ని కాలనీ వాసులు ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కారింగు జానయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శిగా కాజన సతీష్ చారి, కోశాధికారిగా ప్రభాకర పాండే ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమ వంతుగా కృషి చెస్తామన్నారు. తమ నియామకానికి సహకరించిన కాలనీవాసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

54 మంది మద్యంప్రియులకు కౌన్సెలింగ్

కొత్తపేట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడొద్దని టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి, ఎస్‌పీట అమరవర్ధన్‌రెడ్డి సూచించారు. రాచకొండ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిలో 54 మంది మద్యం ప్రియులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌లో భాగంగా సిబ్బంది ప్రదీప్ సందేశాత్మక గీతాలు, మద్యం మత్తులో వాహనాలు నడపడంతో జరిగిన పలు ప్రమాదాల వీడియో క్లిప్పులను, ప్రముఖుల సందేశాలనూ ప్రదర్శించారు.

పిల్లలందరూ ట్రాఫిక్ రూల్స్ గుర్తుంచుకోవాలి

పిల్లలందరూ ట్రాఫిక్ రూల్స్ పాఠాలు గుర్తుంచుకోవాలని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి సూచించారు. సోమవారం ఎల్బీనగర్‌లోని ప్రైవేటు స్కూల్ నుంచి 82 మంది విద్యార్థులు ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోని రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. పార్కులో గల ట్రాఫిక్ నిబంధనల రంగురంగుల సైనేజీ బోర్డులు, రోడ్డు భద్రత సూచికలనూ చూపుతూ నిబంధనల అవసరాన్ని వారికి వివరించారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు ప్రారంభం

సరూర్‌నగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ 9వ డివిజన్‌కు చెందిన తప్పెట సునంద, యేసు దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి పట్టాను సోమవారం కాంగ్రెస్ నాయకులు ఆమెకు అందజేశారు. అనంతరం ఇంటి నిర్మాణానికి ముగ్గుపోసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాదర్‌గుల్ మాజీ సర్పంచ్ మర్రి హన్మంత్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు వల్లపు సుభాన్‌యాదవ్, పార్టీ నాయకులు అశోక్, వెంకటేశ్‌యాదవ్, నర్సింగ్‌రావు, శ్రీశైలం పాల్గొన్నారు.

● ఏపీ సీఎం చంద్రబాబుతో..



ఫిల్మ్‌సిటీలో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

- అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి)

● వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా..



హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్‌తో కలిసి చెకొలేకర్ లక్ష్మీశ్రీనివాస్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ పటేల్, డైరెక్టర్లు మస్రద్ సుల్తానా, ప్రత్యూష మహేష్, పాశం అశోక్‌కుమార్ గౌడ్, నేలపాటి రామారావు, బుద్ధ సత్యనారాయణ, సాయిరాం, పన్నాల రాజేందర్‌రెడ్డి, షకీల్, దుగ్గు జగదీష్ పాల్గొన్నారు.

- చాదర్‌ఘాట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి)